క్లుప్తంగా

గుణాత్మక విద్య అందించాలి



మాట్లాడుతున్న ఎంఈవో చిన్నయ్య

వేమనపల్లి/దండేపల్లి: విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించాలని దండేపల్లి ఎంఈవో చిన్నయ్య, వేమనపల్లి ఎంఈవో శ్రీధర్‌రెడ్డి అన్నారు. వేమనపల్లి, దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎస్జీటీలకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న, చర్చించిన అంశాలను అమలు చేసి విద్యార్థులకు సులభతరంగా మెరుగైన బోధన చేసి అభ్యసన సామర్థ్యాలు సాధించాలన్నారు. దండేపల్లిలో డీఆర్పీలు బుచ్చన్న, లక్ష్మణచారి, మండల రీసోర్స్ పర్సన్లు, కాంప్లెక్స్ రీసోర్స్ పర్సన్లు, వేమనపల్లిలో రిసోర్స్ పర్సన్‌లు శంకర్, వినయ్‌కుమార్, సంతోష్, మహేందర్, శశిధర్, శ్రీకాంత్, రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

మంచిర్యాలఅర్బన్: పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పెండింగ్ బకాయిలు చెల్లించాలని టీవీయూవీ నాయకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఎస్సీ డీడీ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏళ్ల తరబడి ఫీజులు చెల్లించకపోవటంతో పాఠశాల యాజమాన్యాలు ఇబ్బందులకు గురవుతున్నాయని దృష్టికి తీసుకొచ్చారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

మందమర్రిరూరల్: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు పింఛన్‌లు పెంచుతామని హామీ ఇచ్చి ఇప్పటివరకు పెంచలేదని టీడీపీ పట్టణ అధ్యక్షులు వాసాల సంపత్ అన్నారు. వెంటనే పెంఛన్లు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ సతీశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్, టీడీపీ మహిళ పట్టణ అధ్యక్షురాలు జయ, ప్రధాన కార్యదర్శి సంధ్య, కవిత, రాజేష్ తదితరులు ఉన్నారు.

బోరుబావి నిర్మాణ పనులు ప్రారంభం

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటిఎద్దడి నివారణ కోసం మంజూరైన బోరుబావి పనులను శనివారం జిల్లా కాంగ్రెస్ నాయకులు అశోక్ ప్రారంభించారు. నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే వివేక్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ తరగతులు

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమగురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్, డిగ్రీ చదువుకున్న విద్యార్థులకు ఉచిత నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ ప్రిన్సిపాల్ ఆకిడి విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శిక్షణ తరగతులను బెల్లంపల్లి మండల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ తరగతులు బెల్లంపల్లి సీఓఈ కళాశాలలో 30రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసి 18నుంచి 25సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థుల మెరుగైన భవిష్యత్‌కు శిక్షణ దోహదపడుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అక్రమంగా నిర్మించిన షట్టర్ కూల్చివేయాలి



డిప్యూటీ తహసీల్దార్ కల్పనకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం పక్కన ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన షట్టర్‌ను వెంటనే తొలగించాలని ఎమ్మార్పీఎస్ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు రామగిరి మహేశ్ డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ కల్పనకు శనివారం వినతి పత్రం అందజేశారు. వెంటనే అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, మచ్చరాజేశ్, శనిగారపు స్వామి, కె.రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లబండ్లతో ఇసుక



వేమనపల్లి: మండలంలో ఇసుక ఇబ్బంది తీవ్రంగా ఉంది. ప్రభుత్వ భవన నిర్మాణాల అవసరాలకు, గృహ నిర్మాణాలకు ఇసుక అవసరం ఎక్కువగా ఉన్నా, అధికారులు ఇసుకకు అనుమతులు ఇవ్వకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎడ్లబండ్లతో ప్రాణహిత నదికి వెళ్లి ఇసుకను తెచ్చుకుంటున్నారు. ఒక్కో ఎడ్లబండి యజమానికి రూ.250చెల్లించి అవసరాలు తీర్చుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని వేడుకుంటున్నారు.

దుర్వాసనతో అవస్థలు..!



కోటపల్లి: మండలంలోని సర్వాయిపేట గ్రామంలో సేవాలాల్ కాలనీలో ఇటీవల డ్రెయినేజీ నిర్మించినా మురుగునీరు వెళ్లేందుకు దారి లేకపోవడంతో కాలువలోనే నీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారాయి. మురుగునీరంతా దుర్వాసన వెదజల్లుతుందని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు తెలిపారు. అధికారులు స్పందించి మురుగునీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీటితొట్టె నిరుపయోగంగా...



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ పశువైద్య కళాశాల పక్కనే పశువుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటితొట్టె నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఉపాధిహామీ పథకం కింద స్థానికంగా ఈ పశు నీటితొట్టె నిర్మాణం చేపట్టారు. వేసవిలో ఈ నీటితొట్టెలో నీటిని నింపి పశువుల దాహార్తిని తీర్చాల్సి ఉండగా, ఎవరూ స్పందించడం లేదు. నీటి తొట్టెకు కొద్దిపాటి మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చి పశువుల దాహార్తిని తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

అక్కడ రిలీవ్ కాలేదు..ఇక్కడ చేరలేదు?

- దండేపల్లి తహసీల్దార్ బదిలీ ఆర్డర్‌పై చర్చ
- బదిలీ ఆర్డర్ మారనున్నట్లు వినికిడి..

దండేపల్లి: దండేపల్లి తహసీల్దార్‌గా పనిచేసిన సంధ్యారాణిని వేమనపల్లి మండలానికి బదిలీ, కలెక్టరేట్ కార్యాలయ సీ-సెక్షన్ సూపరింటెంటెండ్‌గా పనిచేస్తున్న తహసీల్దార్ క్యాడర్ సంతోష్‌కుమార్‌ను దండేపల్లికి బదిలీ చేస్తూ కలెక్టర్ కుమార్‌దీపక్ ఈ నెల 19న బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ ఉత్తర్వులు వెలువడి ఆరు రోజులు గడుస్తున్నప్పటికీ సంతోష్‌కుమార్ అక్కడ రిలీవ్ కాకపోవడం, ఇక్కడ బాధ్యతలు తీసుకోకపోవడంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. బదిలీ ఆర్డర్ మారే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సంతోష్ కుమార్ స్థానంలో మరో ఇద్దరి పేర్లు ప్రస్తావనకు రావడంపై చర్చలు కోడై కూస్తున్నాయి. బదిలీ అయిన వ్యక్తి ఇక్కడకు వచ్చేందుకు ఇష్టపడటం లేదా? మరేకారణాలతో అయిన బదిలీ ఆర్డర్ మారుతుందా? అనేది అంతుచిక్కడం లేదు. ఇటీవల ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ బదిలీ వెనక కూడా ఏమైనా రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా? లేదా సాధారణ బదిలీనా తెలియడం లేదు. ఎందుకంటే జిల్లాలో ఒక్క దండేపల్లి తహసీల్దార్‌ను మాత్రమే బదిలీ చేయడం పై కూడా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఇద్దరు తహసీల్దార్లు మంచిర్యాల జిల్లాకు బదిలీపై వచ్చారు. వారిలో ఒకరిని దండేపల్లికి బదిలీపై పంపే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోంది. దండేపల్లిలో తహసీల్దార్ బదిలీ జరిగినప్పటి నుంచి తహసీల్దార్ జారీ చేసే వివిధ ధ్రువపత్రాలు జారీ కాకుండా పెండింగ్‌లోనే ఉండిపోయాయి. దండేపల్లి తహసీల్దార్ బదిలీపై నెలకొన్న చర్చతో ఇక్కడకు ఎవరు వస్తారో? ఎప్పుడు వస్తారో? అని మండల ప్రజలు వేచి చూస్తున్నారు.



దండేపల్లి తహసీల్దార్ కార్యాలయం..

ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తి చేయాలి

- బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ

బెల్లంపల్లిరూరల్: వరిధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆర్డీవో పి.హరికృష్ణ అన్నారు. బెల్లంపల్లి మండలం మాలగురిజాల గ్రామంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసే ప్రమాదం ఉండడం వల్ల, కొనుగోలు కేంద్రాల్లో తగిన టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. త్వరితగతిన కొనుగోళ్లు పూర్తి చేసేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్యామల, సీసీ ప్రసాద్, వీవోఏ భాగ్య, రైతులు, సిబ్బంది ఉన్నారు.



తేమశాతం పరిశీలిస్తున్న ఆర్డీవో హరికృష్ణ

అవమానపర్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

చెన్నూర్: తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాలకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను ఆహ్వానించకుండా, ఫ్లెక్సీలలో ఫొటో పెట్టకుండా అవమానపర్చిన ఎమ్మెల్యేతో పాటు దేవాదాయ శాఖ చీఫ్ సెక్రెటరీలపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎంపీకి జరిగిన అవమానాన్ని నిరసిస్తూ ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపి, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకులు ఆసంపల్లి శ్రీనివాస్, తగరం వెంకటి, కాంగ్రెస్ నాయకులు జనగామ తిరుపతి, లింగంపల్లి మహేశ్, దుర్గం వెంకటి, దాసరి కమలాకర్, భీమ్ మధు, వెల్పుల శ్రీనివాస్, రావుల తిరుపతి, చెడం మధు, కుమ్మరి రమేశ్, కొండగొర్ల మధుకర్, సెగ్గెం గట్టయ్య పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వానాకాలం పంటల సాగుపై అవగాహన

చెన్నూర్‌రూరల్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అక్కెపల్లి గ్రామంలో శనివారం రైతులకు వానాకాలం పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సీజన్‌లో ఏయే పంటలు సాగు చేయాలో, ఎలాంటి సస్యరక్షణ చేపట్టాలో వివరించారు. నకిలీ పత్తి విత్తనాలు కొని మోసపోవద్దని సూచించారు. అనంతరం శివలింగాపూర్‌లో రైతు సతీష్ తయారు చేస్తున్న సేంద్రీయ ఎరువుల క్షేత్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ బానోతు ప్రసాద్, ఏవో యామిని, ఏఈవో రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి సిరాజ్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

పాలిసెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

నస్పూర్: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం వెలువడిన పాలిసెట్ ఫలితాల్లో నస్పూర్ విద్యార్థులు ప్రతిభ చాటి ఉత్తమ ర్యాంకులు సాధించారు. పట్టణ పరిధిలోని తీగల్‌పహడ్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన గోనె ప్రసన్నకుమార్ పాలిసెట్‌లో 1735ర్యాంకుతో పాటు ఇటీవల విడుదలైన టీజీఎస్‌ఆర్‌జేసీ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించి బెల్లంపల్లిలో సీటు సాధించాడు. ఎన్. సంతోషి పాలిసెట్‌లో 1872ర్యాంకుతో పాటు ఇటీవల విడుదలైన టీజీఎస్‌ఆర్‌జేసీ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించి నిర్మల్‌లో సీటు సాధించినట్లు హెచ్‌ఎం వామన్ రావు తెలిపారు.



ప్రసన్నకుమార్



ఎన్.సంతోషి

భీమిని: టీఎస్ పాలిసెట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో కన్నెపల్లి మండలంలోని మాడవెల్లి గ్రామానికి చెందిన బోగే వెంకటేశ్వర్-విజయల కుమారుడు బోగే వివేక్ 728వ ర్యాంక్ సాధించాడు. కుటుంబీకులు, గ్రామస్తులు అతడిని అభినందించారు.

'దళారులను నమ్మి మోసపోవద్దు'

తాండూర్: ప్రభుత్వ పథకాల మంజూరు కోసం దళారులను నమ్మి మోసపోవద్దని తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాస్ రుణాల మంజూరులో దళారులను ఆశ్రయించవద్దన్నారు. మండల వ్యాప్తంగా 495మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. సోమవారం నుంచి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తామన్నారు. రాజీవ్ యువవికాస్ పథకం ద్వారా రుణాల మంజూరు ప్రక్రియ తుదిదశలో ఉందన్నారు. ఎవరైనా ప్రలోభ పెట్టినా, డబ్బులు డిమాండ్ చేసినా, వసూలు చేసినా 7780786886 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

దళితులకు అన్యాయం చేస్తే ఊరుకోం

- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం పోచంపాడు గ్రామ శివారులోని వేంపల్లి, ముల్కల్ల గ్రామాలకు చెందిన దళితులు, బీసీలకు సంబంధించిన వారి భూములను తక్కువ ధరకు ఎకరం రూ.13.50లక్షలు చెల్లించి వారికి అన్యాయం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండస్ట్రియల్ పార్కు కోసం సేకరించిన స్థలాలకు ఇవ్వాల్సిన నష్ట పరిహారం న్యాయంగా చెల్లిస్తే తమకు అభ్యంతరం లేదని, కానీ భయపెట్టి, బెదిరించి వాళ్ల దగ్గర నుంచి అన్యాయంగా భూములు తీసుకుంటే, తరువాత తమ ప్రభుత్వం వస్తుందని, ఇప్పుడు ఆయా భూములను ఎవరు కొనుగోలు చేసినా, తరువాత తాము తిరిగి వాటిని ఆధీనంలోకి తీసుకుంటామన్నారు. ప్రస్తుతం వేంపల్లి, ముల్కల్ల గ్రామాలు మంచిర్యాల కార్పొరేషన్‌లో కలిశాయని, భూముల ధరలు ఆకాశాన్ని అంటగా, ఎకరానికి కేవలం రూ.13.50లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. ఇండస్ట్రియల్ పార్కు కోసం భూములను కొనుగోలు చేసిన వారు, తరువాత వచ్చే తమ ప్రభుత్వంలో భూములను ఇచ్చిన వారికి తిరిగి మిగితా డబ్బులను భూములు కొన్నవారితోనే చెల్లించేలా చేస్తామని, డబ్బులు చెల్లించకుంటే తిరిగి ఆ భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్, టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

భూమి ఇప్పించాలని వినతి..

ముల్కల్ల గ్రామానికి చెందిన దళితులమైన తమకు 2009లోనే ప్రభుత్వం 25గుంటల చొప్పున 6ఎకరాల స్థలాన్ని ఇచ్చిందని, కానీ దళితుల భూమిని అదే గ్రామానికి చెందిన రామస్వామి అనే వ్యక్తి వారి పేరిట అవే 6ఎకరాలు ఉన్నట్లుగా అక్రమ కాగితాలు సృష్టించి, ఇండస్ట్రియల్ పార్కు, ఐటీ పార్కు కోసం ఇచ్చారంటూ బాధితులు మాజీ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. తమ భూములకు అక్రమ కాగితాలను సృష్టించి, ప్రస్తుతం ఇండస్ట్రియల్ పార్కు, ఐటీ హబ్ కోసం వాటిని ఇస్తూ, ప్రభుత్వం నుంచి పరిహారం పొందుతున్నారని, తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేసేలా చూడాలని మాజీ ఎమ్మెల్యేను కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ జర్నలిస్టుల ఫోరం(టీజేఎఫ్) 25వ వసంతోత్సవం సందర్భంగా ఈ నెల 31న నిర్వహించుకునే రజతోత్సవ వేడుకల పోస్టర్‌ను శనివారం జిల్లా కేంద్రంలో టీజేఎఫ్, టీయూడబ్ల్యూజే(హెచ్-143) నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2001లో మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన సంవత్సరంలోనే తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఆవిర్భవించినట్లు తెలిపారు. రజతోత్సవ వేడుకలను జలవిహార్ వద్ద ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దాసరి ఉమేశ్, రేణికుంట్ల శ్రీనివాస్, చెట్ల రమేశ్, అంబిలపు శ్రీనివాస్, సిద్ధార్థ, కుమార్, శ్రీనివాస్, గడికందుల రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా టీపీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

జన్నారం/బెల్లంపల్లి: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు శనివారం బెల్లంపల్లి పట్టణం, జన్నారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేశారు. శ్రేణులకు కేక్‌ను పంచి పెట్టారు.

రోడ్డుకు మరమ్మతు



గుంతలు పూడ్చుతున్న పోలీసులు

భీమారం: మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిపై భీమారం సమీపంలో గుంతలమయమైన రోడ్డుకు శనివారం పోలీసులు మరమ్మతు చేపట్టారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గుంతలు పూడ్చినట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

సైన్యానికి సంఘీభావంగా జాతీయ జెండాల ప్రదర్శన



జిల్లా కేంద్రంలో జెండాలు ప్రదర్శిస్తున్న టీచర్లు

మంచిర్యాలఅర్బన్: పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన మారణకాండకు ప్రతీకారంగా పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల ఏరివేతపై చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా శనివారం మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో టీచర్ల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా టీ, మధ్యాహ్న భోజన విరామ సమయంలో సంఘీభావంగా టీచర్లు జాతీయ జెండాల ప్రదర్శన చేపట్టారు. అగ్ని వీర్ మురళీనాయక్‌కు నివాళలర్పించారు. మాజీ సైనికులను సన్మానించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, బగ్గని రవికుమార్, రాసపెల్లి రవిలు పాల్గొన్నారు.



భీమారంలో...

జాతీయ జెండాలతో సంఘీభావం

భీమారం: ఉగ్రవాదుల ఏరివేతకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌కు ప్రభుత్వ ఉపాధ్యాయులు జాతీయ జెండాలతో సంఘీభావం తెలిపారు. మండల కేంద్రంలో ఎమ్మార్సీ కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉగ్రవాదుల దాడులో అమరులైన సైనికులకు నివాళులర్పించారు. అనంతరం భారత్ సైనికుల కుటుంబాలతోపాటు ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో వేణుగోపాల్, సీఆర్పీ సాగర్‌తో పాటు టీచర్లు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలపై సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జీఎం దేవేందర్

■ బొగ్గుబాయి వార్తలు

మందమర్రిరూరల్: జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఏరియాలో ఘనంగా నిర్వహించుకుందామని ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో శనివారం వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, అమరవీరులకు నివాళులు, ఉత్తమ ఉద్యోగులకు సన్మానాలు, తదితర కార్యక్రమాలు ఉంటాయని జీఎం తెలిపారు. సమావేశంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, శాంతిఖని గ్రూప్ ఏజెంట్ ఖాదీర్, ఏరియా సేఫ్టీ అధికారి ఐఈడీ రాజన్న, డీవైపీఎం ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లు ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్: సీసీసీ రాయల్‌టాకీస్ చౌరస్తా నుంచి ఎస్సార్పీ 3గని వరకు వీధి లైట్లు ఏర్పాటు చేయాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో యాజమాన్యంను డిమాండ్ చేశారు. నిత్యం కార్మికులు ఈ దారిలో డ్యూటీలకు వస్తుంటారని, లైటింగ్ లేకపోవడంతో వల్ల ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. దీనిపై పలు మార్లు అధికారుల దృష్టికి కార్మికులు తీసుకెళ్తే లైట్లు పెడుతామంటూ చెప్పడం తప్పా, అమలు చేయడం లేదన్నారు. తక్షణమే లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో తెలంగాణ సైకాలాజిస్ట్ అసోసియేషన్(టీపీఏ) సభ్యులు మానవ అక్రమ రవాణా(హ్యూమన్ ట్రాఫికింగ్) అనే అంశంపై శనివారం అవగాహన కల్పించారు. సమాజంలో జరుగుతున్న అంశాలను వివరిస్తూ, తీసుకోవాల్సిన నివారణ చర్యలు, చట్టాలను వివరించారు. కార్యక్రమంలో టీపీఏ జిల్లా అధ్యక్షుడు రంగు వేణుకుమార్, సెంటర్ ఇన్‌చార్జి రాజ్‌కుమార్, నీలేశ్ మాచల్, నాగోరావు, ఎం.రమణయ్య, రంజిత, సుమన చైతన్య, శ్రీదేవి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వేణుకుమార్